సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



నిప్పు.. భూసారానికి ముప్పు

సార్వా పంట మాసూళ్లు చేసిన పొలాల్లో గడ్డిని రైతులు చేలోనే తగలబెడుతున్నారు. దీని వల్ల అనర్థాలు తప్పవని శాస్త్రవేత్తలు అంటున్నారు. 8లో ▸



కమ్మని రుచి.. తినరా మైమరచి

తాటి తేగ కమ్మని రుచి నోరూరిస్తుంది. నవంబర్ నుంచి మార్చి వరకూ దొరికే తేగల రుచిచూడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 8లో ▸



అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఆలిండియా పరుగు పోటీలకు ఎంపికయ్యారు. 8లో ▸

న్యూస్‌రీల్

శివోహం.. ఆరుద్రోత్సవం



స్వామికి అభిషేకాలు చేస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం పాలకొల్లు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (క్షీరారామం)లో సోమవారం ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సోమవారం, మార్గశిర మాసం, పాడ్యమి, ఆరుద్ర నక్షత్రం ఒకేరోజు రావడం అరుదని అర్చకుడు కిష్టప్ప అన్నారు. క్షేత్రానికి వేకువజాము 4 గంటల నుంచి భక్తుల రాక మొదలైంది. ఆలయ ఈఓ ముత్యాల శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్జీలు పునరావృతం కారాదు



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజాఫిర్యాదులు పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోపు పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుటుంబ కలహాలు, అత్తింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర సమస్యలతో మొత్తం ఆరు ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు.

ఆలయ భూముల పరిరక్షణకు కృషి

భీమవరం(ప్రకాశం చౌక్): దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించడంతో పాటు సకాలంలో కౌలు, లీజు వసూళ్లకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో దేవదాయ శాఖ అధికారులు, ఈఓలతో సమావేశం నిర్వహించారు. రాబడి, ఖర్చు, వనరులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 990 ఆలయాలు ఉండగా 741 ఆలయాలు భూములు కలిగి ఉన్నాయన్నారు. కౌలు, లీజు, డిమాండ్ మొత్తం సుమారు రూ. 52,64,57,000 ఉందని నిబంధనల మేరకు వసూలు చేయాలన్నారు. జిల్లాలో 102 సత్రాలు ఉన్నాయని వాటి ఆదాయ, వ్యవసాయ భూములు, చెరువులు, లీజు వివరాలు సమర్పించాలని సూచించారు. కోర్టులో ఉన్న భూములు విలువ, విస్తీర్ణం, అన్యాక్రాంతం నుంచి విడుదల చేయాల్సిన భూములపై సమీక్షించారు. ఖాళీగా ఉన్న ఆలయ భూముల్లో వనరులు పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు ఏలూరులో సైక్లోథాన్

ఏలూరు రూరల్: ఏలూరులో మంగళవారం సైక్లోథాన్ (సైకిల్ రైడింగ్) నిర్వహించనున్నట్టు రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా సెంటర్ (శాయ్) ఇన్‌చార్జి డీఎస్ వినాయక్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా వ్యాయామంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియం నుంచి పాతబస్టాండ్, వసంత్‌మహల్, ఫైర్‌స్టేషన్ సెంటర్లకు చేరుకుని తిరిగి పవర్‌పేట స్టేషన్ మీదుగా స్టేడియం వెనుక ఉన్న శాయ్ సెంటర్‌కు సైకిల్ రైడింగ్ చేరుతుందని తెలిపారు. శాయ్ సెంటర్, డీఎస్ఏ అథ్లెట్లు, కోచ్‌లు, సిబ్బంది క్రీడాకారులతో పాటు ఆసక్తి గలవారు హాజరుకావాలని కోరారు.

సమన్వయంతో పనిచేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): రాష్ట్ర సచివాలయంలో ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావించిన అంశాలను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధికారులకు వివరించారు. శాఖల వారీగా సూచికలను వివరిస్తూ సమీక్షించారు. సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

132 గ్రామాల్లో సదస్సులు

ఏలూరు(మెట్రో): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. జిల్లాలోని 28 మండలాల్లో 665 రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటివరకూ 132 గ్రామాల్లో సదస్సులు నిర్వహించామన్నారు. సోమవారం 31 గ్రామాల్లో సదస్సులు నిర్వహించామన్నారు.

తెరమరుగు

అభిమాన హీరో కొత్త సినిమా రిలీజయ్యిందంటే చాలు థియేటర్ల వద్ద సందడే సందడి. సంక్రాంతి, దసరా, దీపావళి తదితర పండుగల వేళ ప్రేక్షకుల కోలాహలం అంతా ఇంతా కాదు. నాడు టూరింగ్ టాకీస్‌లుగా, టాకీస్‌లుగా వినోదాన్ని అందించిన సినిమా థియేటర్లు నేడు ఆదరణ కరువై గోడౌన్లుగా, వ్యాపార సముదాయాలుగా మారిపోతున్నాయి. జిల్లావ్యాప్తంగా గత కొన్నేళ్లలో 61 థియేటర్లు మూతపడ్డాయి.





నరసాపురంలో మూతపడిన శారదా థియేటర్

సినిమా హాలు.. ఘొల్లు

- ఓటీటీలకు పెరుగుతున్న క్రేజ్
- థియేటర్లకు తగ్గుతున్న ఆదరణ
- జిల్లాలో 61 సినిమా హాళ్ల మూత
- మిగిలిన వాటికీ నామమాత్రంగా ప్రేక్షకులు
- కొత్త సినిమాలు వచ్చినప్పుడు రెండు, మూడు రోజులే హడావుడి



తణుకులో మూతపడిన శ్రీనివాసా థియేటర్

సాక్షి, భీమవరం : మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు సినిమా మంచి వినోద సాధనం. కుటుంబమంతా కలిసి థియేటర్‌కు వెళ్లి ఆనందించేవాళ్లు. థియేటర్లకు ఎంతో ఆదరణ ఉండేది. బుల్లితెర రాకతో సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. కోవిడ్ సమయంలో ఓటీటీ (ఓవర్ ది టాప్) క్రేజ్ విపరీతంగా పెరిగిపోయింది. సినిమాలు, వెబ్ సిరీస్, టీవీ కార్యక్రమాలు, సెలెబ్రిటీ, తదితర అనేక షోలను ప్రసారం చేస్తూ అప్పట్లో ఓటీటీ ప్లాట్‌ఫాంలే ప్రజలకు వినోద సాధనంగా మారాయి. చిన్న హీరోల నుంచి పెద్ద హీరోల వరకు, చిన్న సినిమాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు కొన్ని నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా.. మరికొన్ని వారం పదిరోజుల్లో ఓటీటీలోకి వచ్చేస్తున్నాయి. వీటి ప్రభావంతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య క్రమేపీ తగ్గిపోయింది. మరోపక్క ఏసీ, మల్టీప్లెక్స్‌లుగా అభివృద్ధి చెంది వినోదంతో పాటు షాపింగ్, ఫుడ్ పాయింట్ కేంద్రాలుగా థియేటర్లు మారాయి. కాలక్రమంలో టికెట్, పార్కింగ్, ఇంటర్వెల్ సమయంలో స్నాక్స్, కూల్ డ్రింక్ ధరలు చూసి కుటుంబ సమేతంగా థియేటర్లకు వెళ్లాలంటేనే బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో సినిమాలు శతదినోత్సవ వేడుకలు జరుపుకుంటే ఇప్పుడు రెండు వారాలు ఆడటం గగనంగా మారింది. కొత్త సినిమాలు విడుదలైన సందర్భంలో రెండు, మూడు రోజుల సందడి మినహా తర్వాత థియేటర్లు ఖాళీ అయిపోతున్నాయి. కనీసం పది మంది కూడా ప్రేక్షకులు రాక షోలు పడని పరిస్థితి నెలకొంటోందని యజమానులు ఆవేదన చెందుతున్నారు.



నరసాపురంలో ఫంక్షన్‌హాల్‌గా మారిన శ్రీలక్ష్మి థియేటర్

ప్రస్తుతం 37 థియేటర్లే..

ప్రస్తుతం జిల్లాలో 37 థియేటర్లు ఉండగా వీటిలో చాలా వరకూ సురేష్ ప్రొడక్షన్స్, గీతా ఆర్ట్స్ తదితర సినీ నిర్మాణ సంస్థలు లీజుకు తీసుకున్నాయి. సౌండ్ సిస్టమ్, ఇంటీరియర్, సిట్టింగ్ తదితర ఆధునిక హంగులతో స్క్రీన్ల సంఖ్యను పెంచి నిర్వహిస్తున్నాయి. కొన్ని థియేటర్లు మాత్రమే యజమానుల చేతుల్లో ఉన్నాయి.

కార్మికులకు ఉపాధి కరువు

ఒక థియేటర్ ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఐదు నుంచి పది మంది వరకు పని ఉండేది. 'మీ అభిమాన థియేటర్లో నేడే చూడండి' అంటూ మైక్ అనౌన్స్ చేయడం, ప్రొజెక్టర్, టికెట్ బుకింగ్ కౌంటర్, స్టాళ్లు, సైకిల్ స్టాండు వద్ద వీరికి ఉపాధి దొరికేది. కొన్ని థియేటర్లు మూతపడటంతో వాటిలో పనిచేసే సిబ్బంది ప్రత్యామ్నాయ పనుల వైపు వెళ్లిపోయారు.

ఐదేళ్ల క్రితం 98 వరకు సినిమా హాళ్లు

జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట, ఉండి నియోజకవర్గాల పరిధిలో ఐదేళ్లకు పూర్వం 98 వరకు సినిమా థియేటర్లు ఉండేవి. సినీలాకాసంలో సందడి చేసిన థియేటర్లు ఆదరణ తగ్గి నిర్వహణ భారంగా మారడంతో గోదాములుగా, ఫంక్షన్ హాళ్లుగా, వాణిజ్య సముదాయాలుగా మారిపోతున్నాయి. భూముల విలువ పెరగడంతో కొన్నింటిని తొలగించి స్థలాన్ని ప్లాట్లుగా విభజించి విక్రయాలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా 61 థియేటర్లు మూతపడ్డాయి. భీమవరంలో ఒక వెలుగు వెలిగిన సత్యనారాయణ, గోవర్ధన్ థియేటర్లు గొడౌన్లుగా, పాలకొల్లులో పేరొందిన రత్న టాకీస్ థియేటర్, వెంకట్రామా థియేటర్లను షాపింగ్ కాంప్లెక్స్‌లుగాను, వీరహనుమాన్ థియేటర్‌ను తొలగించి అపార్ట్‌మెంట్ నిర్మించారు. తాడేపల్లిగూడెంలోని జయలక్ష్మి థియేటర్ ఫంక్షన్ హాల్‌గాను, రేలంగి చిత్రమందిర్, ప్రభాత థియేటర్లు, నరసాపురంలోని ప్రియదర్శిని థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్‌గా, తణుకులోని వెంకటకృష్ణా థియేటర్‌ను వీకే ఫంక్షన్ హాలుగా మార్పుచేశారు. కొన్ని ఎటూ వినియోగానికి నోచుకోక మూతపడిపోయి నాటి జ్ఞాపికాలకు తీపి గుర్తులుగా మిగిలిపోయాయి.

వ్యవసాయ కూలీగా మారాను



పాలకొల్లులోని పలు సినిమా థియేటర్లలో నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేశారు. అప్పట్లో రోజూ ప్రతి షోకూ థియేటర్ వద్ద పండుగ వాతావరణం కనిపించేది. సినిమాలు చూసేందుకు పల్లెటూళ్ల నుంచి ఎడ్లబళ్లు, ట్రాక్టర్లపై ప్రేక్షకులు తరలి వచ్చేవారు. రానురానూ ఆదరణ తగ్గి థియేటర్లు మూతపడటంతో ఉపాధి కోసం నేను వ్యవసాయ కూలీగా మారాను.

– ఉన్నమట్ల భీమారావు, సినిమా థియేటర్ కార్మికుడు, కొంతేరు

నిర్వహణ కష్టమవుతోంది



కొత్త సినిమాలు సైతం ఓటీటీల్లో విడుదలైపోతుండటంతో ఇటీవల కాలంలో థియేటర్‌కు వచ్చే ప్రేక్షకుల సంఖ్య చాలావరకూ తగ్గిపోయి మెయింటినెన్స్‌కు చాలా కష్టంగా ఉంటోంది. ఒక్కోసారి జనం లేక షోలు పడటం లేదు. కనీసం విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కూడా డబ్బులు రావడంలేదు.

– అందే బాపూజీ, అన్నపూర్ణ థియేటర్ యజమాని, నరసాపురం

త్వరితగతిన అర్జీల పరిష్కారం

'మీకోసం'లో 152 వినతుల స్వీకరణ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): మీకోసం అర్జీల పరిష్కారం వేగంగా జరగాలని కలెక్టర్ సి.నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వినతులు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. మొత్తం 152 అర్జీలు వచ్చాయని చెప్పారు. జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ బి.శివనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తాడేపల్లిగూడెం మండలం జగ్గన్నపేటకు చెందిన బెజవాడ పల్లారావు తన ఇంటిని కుమారుడు రాయించుకున్నాడని, ఇప్పుడు ఇంటి నుంచి వెళ్లిపొమ్మని ఒత్తిడి చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు.
- కాళ్ల మండలం దొడ్డనపూడికి చెందిన కొల్లి వెంకటరావు తన భూమి వెబ్ ల్యాండులో ఉన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు.
- నరసాపురం మండలం సీతారామపురానికి చెందిన మారుబోయిన మహేశ్వరరావు తన వ్యవసాయ భూమి నుంచి ఓఎన్‌జీసీ పైపులైన్లు వెళ్లాయని నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.
- గణపవరం మండలం అర్ధవరంవాసి మంతెన పద్మావతి తమ దగ్గరి బంధువులు తక్కువ ధరకు భూమి ఇప్పిస్తానని నగదు తీసుకున్నారని, నాలుగేళ్లు గడిచినా భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదు సరికదా తిరిగి సొమ్ములు కూడా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు.

ఎలక్ట్రిక్ వాహనం ఇప్పించాలని..

కాళ్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు సుంకర సత్యనారాయణ ప్రభుత్వ రాయితీపై ఎలక్ట్రిక్ వాహనం కోసం ప్రయత్నిస్తున్నారు. మీకోసంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. చాలా కాలంగా ఎలక్ట్రిక్ వాహనం కోసం తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు.



భూమి సర్వే కోసం..



తోలేరు శివారు వెంకటాపురానికి చెందిన కె.బాలాజీ తండ్రి వెంకటేశ్వరరావుకు పాలకోడేరు మండలం కొండేపూడిలో 60 సెంట్లు భూమి ఉంది. అయితే 53 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. సర్వే చేసి భూమిని సరిచేయాలని కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.

మురుగు కాలువ ఆధునికీకరించాలని..



నరసాపురం మండలం తీర ప్రాంతమైన వేములదీవి వెస్ట్, ఈస్ట్ పంచాయతీలకు సంబంధించి కుక్కిలేరు మురికి కాలువ ఏళ్లు తరబడి పూడుకుపోయి నిరుపయోగంగా మారిందని, కాలువ బాగుచేస్తే వందలాది ఎకరాలకు మేలు జరుగుతుందని జిల్లా కౌలు రైతుల సంఘం నాయకులు ఎం.రామాంజనేయులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

- పార్టీని మరింత బలోపేతం చేద్దాం
- భీమవరం సమావేశంలో కార్యకర్తలకు నాయకుల పిలుపు



భీమవరంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత వేగిరాజు రామకృష్ణంరాజు. చిత్రంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, నాయకులు మేడిది జాన్సన్, పెండ్ర వీరన్న, వేండ్ర వెంకటస్వామి

భీమవరం: వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో ఓటమి చెందినా ప్రజల్లో ఏమాత్రం ఆదరణ తగ్గలేదని దీనికి సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతం ఓట్లు రావడమే నిదర్శనమని పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ వేగిరాజు రామకృష్ణంరాజు అన్నారు. సోమవారం భీమవరంలో నిర్వహించిన పట్టణ పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీలకు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీ శ్రేణులను కనీసం సంప్రదించకుండా వ్యక్తిగత కారణాలతో పార్టీకి రాజీనామా చేయడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీని వీడే వారిలో నాయకులే తప్ప కార్యకర్తలు లేరని స్పష్టం చేశారు. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పనిచేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. కార్యకర్తలకు ఎటువంటి కష్టం వచ్చినా నాయకులంతా అండగా ఉంటామన్నారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేడిది జాన్సన్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు, ప్రజలు అండగా ఉన్నారనడానికి ఇటీవల రైతు సమస్యలపై చేపట్టిన ఆందోళన విజయవంతం కావడమేగా నిదర్శనమన్నారు. ఎంబీసీ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయిస్తున్న కేసులకు ఎవరూ భయపడనవసరం లేదన్నారు. వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కూటమి నాయకుల హామీలు అమలుకాకపోవడంతో ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. భీమవరం జెడ్పీటీసీ కాండ్రేగుల నర్సింహరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ అందరూ పార్టీపై అంకితభావంతో పనిచేయాలని కోరారు.

పట్టణ అధ్యక్షుడిగా రామరాజు

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా 6వ వార్డుకు చెందిన గాదిరాజు రామరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో భీమవరంలోని 39 వార్డుల్లో సమావేశాలు ఏర్పాటుచేసి పూర్తిస్థాయి పట్టణ కమిటీని నియమిస్తామన్నారు. నాయకులు కోడే యుగంధర్, కామన నాగేశ్వరరావు, ఏఎస్ రాజు, పాలవెల్లి మంగ, నందమూరి ఆంజనేయులు, తిరుమాని ధనుంజయ, పేరిచర్ల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

మోషేన్‌రాజు అభినందనలు

పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన గాదిరాజు రామరాజు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. మోషేన్‌రాజు పుష్పగుచ్ఛం అందించి రామరాజును అభినందించారు.



రామరాజును అభినందిస్తున్న శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు

నెలగంట మోగింది

- శ్రీవారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు
- నెల రోజులపాటు తిరుప్పావై సేవలు



శ్రీవారి పాదుకా మండపం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో సోమవారం ఉదయం 6.51 గంటలకు అర్చకులు, పండితులు నెలగంట మోగించి ధనుర్మాస ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. ముందుగా దేవస్థానం సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను మామిడి తోరణాలు, అరటి బోదెలు, పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపాన్ని సుందరీకరించారు. శ్రీవారి పాదుకా మండప ప్రాంతాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. మహిళా భక్తులు ఆలయ ప్రధాన రాజగోపుర మెట్లకు పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. నెలరోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలను నేత్రపర్వంగా క్షేత్రంలో నిర్వహించనున్నారు. ప్రతిరోజూ వేకువజామున ఆలయంలో సుప్రభాత సేవకు బదులు తిరుప్పావై సేవా కాలాలను జరుపనున్నారు. మంగళవారం నుంచి స్వామివారి గ్రామోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉదయం స్వామివారు ఉభయ దేవేరులు, గోదాదేవితో కలిసి క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగి, ధనుర్మాస మండపం వద్దకు చేరుకుంటారు. అక్కడ అర్చకులు స్వామి, అమ్మవార్లను మండపంలో ఉంచి పూజాదికాలను జరిపిస్తారని ఆలయ ఈఓ ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

ఎస్ఏ-1 పరీక్ష రద్దు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల విద్యార్థులకు సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షల్లో భాగంగా సోమవారం 8వ తరగతి విద్యార్థులకు జరగాల్సిన గణితం పరీక్షను రద్దు చేశారు. పరీక్ష పత్రంతో పాటు జవాబులు కూడా యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ పరీక్షలను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష తిరిగి ఈనెల 20న నిర్వహించే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. పరీక్ష ప్రశ్నాపత్రం, జవాబులు సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడం కూటమి ప్రభుత్వం వైఫల్యమేనని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. చిన్నపాటి పరీక్షల నిర్వహణలోనే విఫలమైతే రానున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ప్రశ్నార్థకమేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దల సామాజిక వర్గానికి చెందిన పాఠశాలల యాజమాన్యాలకు అనుకూలంగా టెస్ట్ పరీక్షలు జరిగే ప్రమాదముందని ఆరోపిస్తున్నారు.

ఇంధన పొదుపు.. భవితకు మదుపు

కలెక్టర్ నాగరాణి



జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: ఇంధనాన్ని పొదుపు చేయడం ద్వారా భావితరాలకు వెలుగు నిద్దామని కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రకాశం చౌక్ నుంచి పీపీ రోడ్డు మీదుగా విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం వరకు విద్యుత్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రకాశం చౌక్ వద్ద మానవహారంలో ఇంధన పొదుపుపై కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంధనాన్ని పొదుపుగా వాడటం ద్వారా భవిష్యత్తులో దేశానికి విద్యుత్ సమస్య లేకుండా చేయవచ్చన్నారు. రోజురోజుకూ దేశంలో విద్యుత్ వినియోగం పెరిగిపోతోందని, దీనిని తగ్గించేందుకు సంప్రదాయేతర ఇంధన వినియోగాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. వ్యవసాయ, గృహ అవసరాలకు సోలార్ విద్యుత్‌ను వినియోగించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎల్‌ఈడీ బల్బుల వాడకం ద్వారా 60 శాతానికి పైగా విద్యుత్ ఆదా చేద్దామని పిలుపునిచ్చారు. ఇంధన వనరుల పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిది అని తెలిపారు. విద్యుత్ ఎస్ఈ ఆలపాటి రఘునాథ్ బాబు, ఈఈలు ఎం.ఝాన్సీ, ఎస్.వెంకటేశ్వరరావు, కె.నరసింహమూర్తి, కె.మధుమూర్తి, డీఈలు, ఏఈలు, సిబ్బంది, వినియోగదారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విష్ణు డెంటల్ కళాశాలకు విశిష్ట గుర్తింపు



యాపిల్ గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న విష్ణురాజు

భీమవరం : భీమవరం విష్ణు డెంటల్ కళాశాల యాపిల్ విశిష్ట పాఠశాలగా గుర్తింపు పొందిందని ప్రిన్సిపాల్ ఎ.వి.రామరాజు తెలిపారు. యాపిల్ ఉత్పత్తులు వినియోగిస్తూ, అధునాతన సాంకేతికతతో విద్యాబోధన చేయడానికి దోహదపడుతుందని అన్నారు. యాపిల్ 5 కళాశాలలను గుర్తించగా యూఎస్‌ఏ వెలుపల గుర్తింపు పొందిన ఏకైక డెంటల్ కళాశాల విష్ణు డెంటల్ కళాశాల అని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా 37 దేశాల నుంచి 889 పాఠశాలలు మాత్రమే ఈ ఘనతను సాధించాయన్నారు. ఈ సందర్భంగా గుర్తింపు పత్రాన్ని అందుకున్న విష్ణు విద్యా సంస్థల చైర్మన్ విష్ణు రాజు అభినందనలు తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో ప్రతిభ



నేషనల్ రోలర్ స్కేటింగ్ విజేతలైన విద్యార్థులతో డైరెక్టర్ ప్రకాశరావు

తణుకు అర్బన్: 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ స్కూలు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. ఈనెల 5 నుంచి 15 వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన పోటీల్లో ఇన్‌లైన్ హాకీ అండర్-11 విభాగంలో అందు మోయిత్రీదాస్ బంగారు పతకం, రోలర్ హాకీలో మిక్స్‌డ్ అండర్-11 విభాగంలో నిత్యేష్ గౌడ్ కాంస్య పతకం, రోలర్ హాకీ మిక్స్‌డ్ అండర్-14 విభాగంలో కాంస్య పతకాలు దక్కినట్లు వివరించారు.

రైలు పట్టాలు దాటుతూ కానిస్టేబుల్ మృతి



కానిస్టేబుల్ మధుబాబు

ఏలూరు (టూటౌన్): రైలు పట్టాలు దాటుతూ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి ఏలూరులో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సైమన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు గొల్లాయిగూడెంకు చెందిన రామేశ్వరపు మధుబాబు కాకినాడ 3వ బెటాలియన్‌లో పనిచేస్తున్నాడు. సెలవుపై ఇంటికి వచ్చి తిరిగి రాత్రి డ్యూటీకి వెళ్లే క్రమంలో.. రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. రైల్వే ఎస్సై సైమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డికి నిప్పు.. భూసారానికి ముప్పు

- వేడితో మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలకు నష్టం
- భూమి నత్రజని, ఫాస్పరస్ కోల్పోయే ప్రమాదం

పాడి-పంట

భీమవరం: వరి కోత యంత్రాలతో సార్వా పంట మాసూళ్లు చేసిన పొలాల్లో ఎక్కువ మంది రైతులు గడ్డిని చేలోనే తగలబెడుతున్నారు. భూమిలో గడ్డిని కలియదున్నడం వల్ల భూసారం పెరిగే అవకాశమున్నా.. ఎక్కువగా దమ్ముచేయాల్సి ఉండడం, దానికి అదనంగా ఖర్చు పెరగడంతో కొంతమంది రైతులు గడ్డిని తగలబెట్టే పనిలో ఉన్నారు. వరి చేలలో ఎండుగడ్డి, వరిమోళ్లను తగలబెట్టడం వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుంది. వేడి వల్ల మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయి పైరుకు నష్టం కలుగుతుంది. వరి సాగులో రైతన్నలు కూలీల కొరతను అధిగమించడానికి, సాగు ఖర్చులు తగ్గించుకోడానికి ఎక్కువగా యంత్రాలు వినియోగిస్తున్నారు. వరికోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్న పంటలో వరిగడ్డి, మోళ్లను చేలలోనే తగలబెట్టడం పరిపాటిగా మారింది. వరిచేలలో గడ్డిని తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలున్నాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. జిల్లాలోని 20 మండలాల్లో సుమారు 2.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుతం మాసూళ్లు పూర్తికావస్తున్న తరుణంలో రైతులు దాళ్వా సాగుపై దృష్టిసారించారు. గడ్డిని తగలబెట్టే పద్ధతి గతంలో కేవలం పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఈ పద్ధతి దేశమంతా పాకింది.



వరిచేలలో గడ్డిని తగలబెట్టడంతో బూడిదగా మారిన దృశ్యం

గడ్డి తగలబెట్టడం వల్ల నష్టాలు

రైతులు పొలంలో గడ్డిని తగలబెట్టడం వల్ల వేడి భూమిలో సుమారు సెంటీమీటరు లోతు వరకు వెళ్తుంది. దీనివల్ల క్రమేపీ భూములు నిర్జీవంగా మారిపోతాయి. వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటలను ఆశించే చీడపీడల ఉధృతి క్రమేపీ పెరిగిపోతుంది. టన్ను గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల ఫాస్పరస్, 2.5 కిలోల పొటాషియం, 1.0 కిలోల సల్ఫర్‌తో పాటు నేలలో ఉండే సేంద్రీయ కర్బనం కూడా కోల్పోతుందని శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలో తేలింది.

పంట వ్యర్థాల సమర్థ వినియోగానికి ప్రత్యామ్నాయాలు

ప్రస్తుతం పంట వ్యర్థాల సమర్థ వినియోగంపై శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్టు చేయడం వల్ల ఎంతో విలువైన సేంద్రీయ ఎరువు తయారవుతుంది. సేంద్రీయ ఎరువులు పర్యావరణ హితమైనవేగాక సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. వరి గడ్డి పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుంది. కొన్ని ప్రైవేటు సంస్థలు వరిగడ్డిని ఉపయోగించి ప్యాకింగ్ మెటీరియల్, కార్డ్ బోర్డ్‌లు, ప్లేట్స్, స్ట్రాలు, బయో-ఇథనాల్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేస్తున్నందున గడ్డిని విక్రయించుకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చు.

గడ్డిని తగలబెట్టడంతో అనర్థాలు



చేలలో వరిగడ్డి తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలున్నాయి. గడ్డి తగలబెట్టిన వేడి వల్ల భూమికే కాకుండా మనుషులకు తీవ్ర నష్టాలున్నాయి. గడ్డిని సమర్థంగా వినియోగించుకోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమేగాక రైతులు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వరిగడ్డిని చేలలో దుక్కి దున్నడం వల్ల పైరుకు సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడుతుంది.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, మార్టేరు పరిశోధన స్థానం

ఉద్యోగాలకు ఎంపికైన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



ట్రిపుల్‌ఐటీ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య అమరేంద్రకుమార్

నూజివీడు: ట్రిపుల్‌ఐటీలోని ఎంఎంఈ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఐదుగురు క్యాంపస్‌లో నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. నీలపు శ్రీవాణి, ఎస్. క్రాంతికుమారి, కే హేమలత, కే మమతాంజలి, వై మంజుల చెన్నైకు చెందిన కేసీపీ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు రూ.3 లక్షల వార్షిక వేతనానికి ఎంపిక కాగా డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు పరిమితం కాకుండా కోర్ గ్రూపుకు సంబంధించిన మెరుగైన ఉద్యోగ అవకాశాలున్నాయని వాటివైపు దృష్టి సారించాలన్నారు. గత కొన్నేళ్లుగా మెటలర్జీ విభాగం విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరిచి ఉద్యోగాలను అందిపుచ్చుకుంటున్నారన్నారు. దేశంలో మెటలర్జీ రంగంలో ఉద్యోగాల కొరత ఉందని, ఎన్నో ఉద్యోగ అవకాశాలున్నాయని విభాగాధిపతి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రాణిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ వీర శ్రీను, శివకుమార్, జ్యోతీలాల్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వానికి మారుపేరు మూర్తి రాజు



మూర్తిరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: మాజీ మంత్రి, సర్వోదయ నాయకుడు చింతలపాటి సీతారామ చంద్ర వరప్రసాద్ మూర్తిరాజు దేశ భక్తుల పేరిట విద్యాలయాలు స్థాపించి గాంధీజీ ఆశయాలతో జీవించారని, సమాజ సేవకే జీవితాన్ని అంకితం చేశారని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గాంధేయవాది మూర్తిరాజు 106వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక అడ్డ వంతెన దగ్గర నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నిస్వార్థ భావంతో 63 విద్యాలయాలను స్థాపించి దేశ నాయకుల పేర్లను ఆ విద్యాలయాలకు పెట్టి మూర్తి రాజు జాతీయతను చాటుకున్నారన్నారు. క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి మాట్లాడుతూ మూర్తిరాజు గాంధేయం నవ భారత నిర్మాణానికి సోపానమని, ఆయన విద్యాలయాల్లో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారన్నారు. వృద్ధాశ్రమ నిర్వాహకులు భూపతిరాజు సత్యనారాయణరాజు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మాజీ కార్యదర్శి కలిదిండి గోపాలకృష్ణంరాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, ఉద్దరాజు కాశీ విశ్వనాథరాజు, ఏఎస్ రాజు మాట్లాడుతూ మూర్తిరాజు విద్యా సేవలు అద్వితీయమని, ఆయన మార్గాన్ని అనుసరించాలని, దాతృత్వానికి మారుపేరు మూర్తిరాజు అని చెప్పారు. కార్యక్రమంలో కంతేటి వెంకటరాజు, వల్లూరి రాధాకృష్ణ మూర్తి, వేగేశ్న రమణరాజు, సీహెచ్ ఝాన్సీ, పీ సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం రూరల్: చదువుతోపాటు ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని అలవర్చుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సీతారామపురంలో స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పోటీలు ఫుట్‌బాల్ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేందుకు అత్యుత్తమ సౌకర్యాలు, అవకాశాలను కల్పించేందుకు జెఎన్‌టీయూ కె కట్టుబడి ఉందన్నారు. వివిధ కళాశాలల నుంచి వచ్చిన 17 జట్ల మధ్య పోటీలు జరిగాయి. 350 మంది విద్యార్థులు, 50 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మంగళవారం సెమీఫైనల్ పోటీలు నిర్వహించి అనంతరం ఫైనల్ పోటీలు నిర్వహిస్తారు.

అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నతానియేలు

దెందులూరు: గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలోని ముగ్గురు విద్యార్థినిలు ఆలిండియా పరుగు పందెం పోటీలకు(అథ్లెటిక్స్) ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నతానియల్ అన్నారు. బీపీఈడీ రెండో సంవత్సరం చదువుతున్న వి.జయశ్రీ 100 మీటర్ల పరుగుపందెంలో కొత్త రికార్డును సృష్టించింది. ఏ.సత్య దుర్గాభవాని 200 మీటర్ల పందెంలో విజయం సాధించింది. జి.పావని సాయి మహ 21 కిలోమీటర్ల పరుగుపందెంలో ప్రతిభ కనపరిచింది. వీరు ఈ నెలాఖరున ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న ఆలిండియా అథ్లెటిక్స్ పోటీలకు నన్నయ విశ్వవిద్యాలయం తరఫున పాల్గొంటారని తెలిపారు.

ఉద్యాన వర్సిటీతో ఒప్పందం



ముంబై సంస్థతో ఒప్పందం చేసుకుంటున్న ఉద్యాన వర్సిటీ వీసీ కె.గోపాల్

తాడేపల్లిగూడెం: ఉద్యాన వర్సిటీ పరిధిలోని పరిశోధన, బోధన, విస్తరణ రంగాల పురోగతిని బలోపేతం చేసేందుకు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ముంబైకు చెందిన మొండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమవారం మాస్టర్ గ్రాంట్ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ మేరకు ఉద్యాన వర్సిటీ వీసీ గోపాల్, కోకోవా లీడ్ ఇండియా చైర్మన్ రూపక్ భట్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రూపక్ భట్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధి ధ్యేయంగా కాకుండా సామాజిక అభివృద్ధిని కాంక్షిస్తూ తమ కంపెనీ అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వర్సిటీలో బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేస్తున్న 18 మందికి 13 లక్షల మొత్తం స్కాలర్ షిప్ మంజూరుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వీసీ కె.గోపాల్ మాట్లాడుతూ పరిశోధనలకు చేయూత నివ్వడానికి వర్సిటీ సిద్ధంగా ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చింతలపూడి: చింతలపూడి మండలం తలార్లపల్లి వద్ద సోమవారం రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చాట్రాయి మండలం మర్రిబంధం గ్రామానికి చెందిన తనగాల కాంతారావు(55) ద్విచక్ర వాహనంపై చింతలపూడి వచ్చి తిరిగి వెళ్తూ ప్రమాదవశాత్తూ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కమ్మని రుచి.. తినరా మైమరచి

- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో జోరుగా తేగల వ్యాపారం
- తక్కువ ధరలో మంచి పౌష్టికాహారం



తేగలు అమ్ముతున్న దృశ్యం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న తేగలు

గణపవరం: తాటి తేగ కమ్మని రుచి ఈ సీజన్‌లో తప్పకుండా నోరూరిస్తుంది. చలికాలంలో నవంబర్ నుంచి మార్చి వరకూ దొరికే ఈ తేగలను రుచిచూడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన తాటితేగల వ్యాపారం ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లో కూడా జోరుగా సాగుతోంది. ఉభయగోదావరి జిల్లాల్లో రహదారుల పక్కన ఈ తేగల వ్యాపారం జోరుగా సాగుతుంది. దీంతో రహదారుల కార్లు, ద్విచక్ర వాహనదారులు తేగల దుకాణాల వద్ద ఆగి కొని తీసుకెళ్తున్నారు. వ్యాపారులు ఉదయాన్నే పచ్చితేగలను తెచ్చి అక్కడే కుండలలో పెట్టి కాల్చి అమ్ముతుంటారు.

ఒకప్పుడు తక్కువ ధరకు లభించే తేగల ధరకూ ఇటీవల బాగా పెరిగింది. ఐదారేళ్ల క్రితం పది తేగల కట్ట రూ.15 నుంచి రూ.20 వరకూ ఉండేది. ఇప్పుడు నాణ్యమైన పది తేగల కట్ట రూ.100కు విక్రయిస్తున్నారు. నాసిగా ఉంటే రూ.50కి అమ్ముతున్నారు. తాటిచెట్లు ఎక్కువగా కనిపించే డెల్టా, మెట్ట, సముద్ర తీర ప్రాంతాలలో ఎక్కువగా తేగలు లభిస్తాయి. ఆయా ప్రాంతాల నేల స్వభావాన్ని బట్టి తేగల రుచి కూడా మారుతుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు పదివేల మందికి పైగా తేగల వ్యాపారంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

గతంలో ఇంట్లోనే తేగల పాతర

గతంలో గ్రామీణ ప్రాంతాలలో ఇంటి పెరట్లో తేగల పాతర ఉండేది. రైతులు పొలం వెళ్లి రాలిన తాటిపండ్లు, తాటి గెలలు తెచ్చి ఇంటి దగ్గర పాతరగా వేసేవారు. ఆ పాతర నుంచి రోజూ తేగలు తవ్వి కుండల్లో కాల్చేవారు. రుచిగా, కమ్మదనం కలిగిన ఈ తేగలను పెద్దా, చిన్నా తేడా లేకుండా ఎంతో ఇష్టంగా తినేవారు. రానురాను గ్రామీణ ప్రాంతాలలో రైతుల ఇళ్ల వద్ద కూడా తేగల పాతరలు కనుమరుగయ్యాయి.

ప్రొటీన్, పీచు శాతం అధికం

కమ్మదనానికి పెట్టిన పేరయిన తేగలలో ప్రొటీన్, పీచు ఎక్కువగా ఉండటంతో ఏ వయసు వారికైనా మేలు చేస్తాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. తేగలలో కాల్షియం ఎక్కువగా ఉండటం వల్ల ఎముకలు, దంతాలకు మేలు. తేగలలో ఉండే ఫైబర్ మలబద్ధకాన్ని పోగొడుతుంది. రక్తంలోని గ్లూకోజ్, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి తేగలు దోహదపడతాయి. వీటిలో ఐరన్ పుష్కలంగా ఉండటం వల్ల హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. వీటిని ఎండబెట్టి బెల్లం కలిపి తింటే మహిళల్లో రక్తహీనత సమస్య తొలగిపోతుంది. తేగలు తినడంవలన కడుపునిండిన భావన కలగడంతో ఆహారం తక్కువగా తీసుకోవడం ద్వారా బరువు తగ్గడానికి ఇవి దోహదపడతాయని గణపవరం పీహెచ్‌సి వైద్యాధికారి పులపర్తి సంతోష్ తెలిపారు.

నాలుగు నెలలే కీలకం

నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకూ నాలుగు నెలలు తేగల వ్యాపారం జరుగుతుంది. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తాటిగెలలను జిల్లాలోని ఇతర ప్రాంతాలనుంచి తెచ్చుకుంటారు. ఇందుకోసం ఒక్కో చెట్టుకు రూ.100 చొప్పున చెల్లించి తాటి గెలలు కొట్టిస్తారు. ట్రాక్టర్‌పై తెచ్చి ఖాళీ స్థలాల్లో పాతరగా వేస్తారు. రెండు మూడు పర్యాయాలు నీటితో తడుపుతారు. నవంబర్ నుంచి తేగలు సిద్ధమవుతాయి. వీటిని ఫిబ్రవరి వరకూ అమ్ముతుంటారు. గణపవరం, నల్లజర్ల, దూబచర్ల, మొగల్తూరు, నర్సాపురం, యలమంచిలి, పెనుగొండ తదితర గ్రామాలలో ఎక్కువగా తేగల వ్యాపారులు ఉన్నారు.

ఖర్చులు పెరిగిపోయాయి



తేగల వ్యాపారంలో ఎంత కష్టపడినా కూలీ ఖర్చులు కూడా మిగలడంలేదు. జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లి తాటి గెలలు తేవడానికి ఖర్చులు పెరిగిపోయాయి. గతంలో ఒక తాటి చెట్టుకు రూ.30 ఉండగా ప్రస్తుతం ఒక్కో చెట్టుకు రూ.100 ఇచ్చి గెలలు నరికిస్తున్నాం. ఒక్కో ట్రాక్టరు తాటికాయలు తేవడానికి రూ. 10 వేల వరకూ ఖర్చవుతుంది. ఏటా ఐదారు ట్రక్కుల తాటి టెంకలు తెచ్చేవాడిని. ఖర్చులు పెరిగిపోవడంతో రెండు ట్రక్కుల సరుకు మాత్రమే తెచ్చి పాతర వేస్తున్నాను.

పెచ్చెట్టి సత్యనారాయణ, తేగల వ్యాపారి, పిప్పర

క్లుప్తంగా

వీరేశ్వరస్వామికి అభిషేకాలు



కొంద్రుప్రోలులో వీరేశ్వరస్వామిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొంద్రుప్రోలు గ్రామంలో శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారిని ధనుర్మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆలయ అర్చకులు రామేశ్వరపు రామలింగేశ్వర శర్మ బ్రహ్మత్వంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



అత్తిలిలో నూతనంగా ఎన్నికైన పంచాయతీ కార్యదర్శుల సంఘ సభ్యులు

అత్తిలి: మండలం పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక సోమవారం అత్తిలిలో జరిగింది. సంఘ గౌరవ అధ్యక్షునిగా ఉనికిలి కార్యదర్శి పి ఫణిరాజు, అధ్యక్షునిగా కొమ్మర కార్యదర్శి జి శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా కంచుమర్రు సెక్రటరీ జి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా వరిఘేడు సెక్రటరీ జి శ్రీనివాస్, కార్యదర్శిగా బల్లిపాడు సెక్రటరీ పి మనోజ్‌కుమార్, కోశాధికారిగా అత్తిలి సెక్రటరీ జి భాస్కర్, మహిళా కార్యదర్శిగా ఉరదాళ్లపాలెం సెక్రటరీ టి ఝాన్సీ, సాంస్కృతిక కార్యదర్శిగా కెఎస్ గట్టు సెక్రటరీ ఈ విజయ్, ప్రచార కార్యదర్శిగా స్కిన్నెరపురం సెక్రటరీ యూ ప్రసాదరావులు ఎన్నికయ్యారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలు, రైతులు తమ భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం, కొత్తూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ అడంగల్, ఆన్‌లైన్‌లో తప్పులు, భూ వివాదాలు వంటి సమస్యలకు అర్జీలు చేసుకోవచ్చన్నారు. వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు మద్దుకూరి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతులు అప్రమత్తంగా ఉండాలి



పట్టింపాలెం గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మినుము రైతాంగం అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి ఆర్ ఎస్.ప్రసాద్ సూచించారు. సోమవారం మండలంలోని పట్టింపాలెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం గ్రామాల్లో పర్యటించి, మినుము రైతులను అప్రమత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మినుము మాసూలు చేసిన రైతులు త్వరితగతిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రైతాంగం దాళ్వా పంటకు సిద్ధం కావాలన్నారు. త్వరితగతిన నారుమడి పోసుకోవాలన్నారు. ముందుగా దాళ్వా పనులు చేపట్టడం ద్వారా మార్చి, ఏప్రియల్ నెలకు పంట చేతికొస్తుందన్నారు. తద్వారా ఎటువంటి ప్రకృతి విపత్తుల బారిన పడి పంట దెబ్బతినదన్నారు. ఈ విషయాలను రైతాంగం గుర్తించాలన్నారు.

వైష్ణవ ఆలయాలలో తిరుప్పావై ప్రవచనాలు

అత్తిలి: ధనుర్మాసం సోమవారం నుంచి ప్రారంభం కావడంతో వైష్ణవ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి ప్రవచించిన తిరుప్పావై ప్రవచనాలు రోజుకొక్క పాసురాలుగా ప్రవచిస్తారు. నెలరోజుల పాటు ప్రవచనాలు పూర్తయ్యాక గోదాదేవి కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అత్తిలి మండలంలో బల్లిపాడు మదనగోపాలస్వామి, అత్తిలిలో వేణుగోపాలస్వామి, ఈడూరులో వరాల వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు ప్రారంభమయ్యాయి.

తరలివస్తున్న బ్రాండెడ్ దుకాణాలు

అందుబాటులో అన్ని సౌకర్యాలు



చెన్నై షాపింగ్ మాల్



జీవి మాల్



ట్రెండ్స్



విజేత సూపర్ మార్కెట్

తాడేపల్లిగూడెం: గూడెం బ్రాండెడ్ షోరూంల రాకతో మెరిసిపోతుంది. ఎలక్ట్రికల్ దుకాణాలు, వస్త్ర దుకాణాలు వరుసగా పట్టణానికి తరలి వస్తున్నాయి. గత ప్రభుత్వం రహదారులను విస్తరణ చేయడం, మౌలిక వసతులు కల్పించిన నేపథ్యంలో పెద్ద వ్యాపార సంస్థలు ఇక్కడికి తరలిరావడానికి ఆసక్తిని కనబరుస్తున్నాయి. అపరాలు, ఉల్లి, బెల్లం, నూనెలు, రవ్వల, రైస్ మిల్లింగ్ పరిశ్రమగా వాణిజ్య కేంద్రంగా పట్టణం ఖ్యాతిగాంచింది. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం, జాతీయ ఉన్నత విద్యాసంస్థ ఏపీ నిట్ కూడా ఇక్కడ ఏర్పాటు కావడంతో దేశ వ్యాప్తంగా ఇక్కడికి వచ్చే అవసరాలకు అనుగుణంగా బ్రాండెడ్ షోరూంల రాక మొదలైంది. ఈ క్రమంలో పాదరక్షల దుకాణాలు రాకకు మార్గం పడింది. స్టూడెంట్ బ్రాండెడ్ వస్త్ర దుకాణాలు వచ్చాయి. వీటి వెంట సోనో విజన్, బజాజ్, సత్యా ఎలక్ట్రానిక్స్ వంటి ఎలక్ట్రికల్ బ్రాండెడ్ దుకాణాలు వచ్చాయి. జీవి మాల్ వస్త్ర దుకాణం రాకతో పట్టణానికి కొత్త సొబగు వచ్చింది. తర్వాత చెన్నై షాపింగ్ మాల్, ఆ తర్వాత వరమహాలక్ష్మి వస్త్ర దుకాణాలు కొలువు తీరాయి. షాపింగ్ మాల్స్ విషయానికొస్తే మోర్, రిలయన్స్, విజేత వంటి సూపర్ బజార్లు వచ్చాయి. త్వరలో డీ మార్టు కూడా ఇక్కడికి రానుంది.

త్రీస్క్రీన్స్

ఆర్టీసీ బస్టాండ్ ఆవరణకు దగ్గరగా మల్టీప్లెక్స్ సౌకర్యాలతో గుజరాత్‌కు చెందిన కంపెనీ ఆధ్వర్యంలో విజేత సూపర్ మార్కెట్ వెనుక త్రీ స్క్రీన్స్ సినిమా ప్రదర్శనకు హంగులు దిద్దుకుంటున్నాయి. ఒక్కొక్క థియేటర్‌లో 135 సామర్థ్యంలో బహుభాషా చిత్రాల ప్రదర్శనకు వీలుగా, కార్పొరేట్ హంగులతో వీటిని నిర్మిస్తున్నారు. దేశ వ్యాప్తంగా మల్టీప్లెక్సులను నిర్వహించే గుజరాత్ కంపెనీ వీటిని నిర్వహించనుంది.

వాణిజ్య కేంద్రంగా గూడెం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు భౌగోళికంగా కేంద్రస్థానంలో ఉన్న గూడెం పట్టణం. ఆది నుంచి వాణిజ్య కేంద్రంగా వెలుగొందింది. చుట్టు పక్కల వ్యాపారులకు, ప్రజలకు ఇది గుత్త కొనుగోలు కేంద్రం. సంతల వ్యాపారానికి ఇది తల్లి సంత. అపరాలు, బెల్లం, ఉల్లిపాయలు, నూనెలు, బియ్యం వ్యాపారానికి పట్టణం పెట్టిందిపేరు. పట్టణ జనాభా లక్షా పదివేలకు పైన ఉంది. ఫ్లోటింగ్ పాపులేషన్ అంటే రోజు పట్టణానికి వచ్చి, పోయేవారు సుమారు లక్ష మంది వరకు ఉంటారు. ఉల్లిపాయల వ్యాపారం ఇక్కడ సీజన్ అంతా కలిపి రూ.200 కోట్ల వరకు ఉంటుంది. గుత్త నూనెల వ్యాపారం కోట్లలో సాగుతోంది. జిల్లాలో నూనెల గుత్త వ్యాపారానికి గూడెం ఒక పాయింటు. వస్త్ర దుకాణం విషయాని కొస్తే గత కొన్ని నెలల ముందు వరకు సాంప్రదాయ వ్యాపారం మాత్రమే సాగింది. వన్‌టౌన్‌లో మూడు దుకాణాలు, టూ టౌన్‌లో ఒకటి, రెండు దుకాణాలు మాత్రమే వస్త్ర వ్యాపారానికి చిరునామాగా ఉండేవి. వస్త్ర ప్రభావం పాత రోజుల్లో చవి చూసిన వ్యాపారసంస్థలు దాన్ని కోల్పోయాయి. కొత్త సంస్థలు పుట్టుకొచ్చి వ్యాపారంలో గుత్తాధిపత్యం చెలాయించాయి. రోజుకు 25 లక్షల రూపాయల సాగే వస్త్ర వ్యాపారం పెద్ద సంస్థల రాకతో రోజుకు కనీసం రెండు కోట్ల రూపాయలకు పెరిగింది. నగరాలకే పరిమితమైన పెద్ద వస్త్రదుకాణంలో గూడెంను చిరునామాగా మార్చుకుంటున్నాయి. దీంతో కొనుగోలు శక్తి పెరగడం, నూతన మోడళ్లు, వస్త్రాలు అందుబాటులోకి రావడంతో ఒక్క సారిగా గూడెం బ్రాండింగ్ మెరిసింది.సినిమా వ్యాపారానికి వస్తే పట్టణంలో మూడు మ్యాట్నీలు. ఆరు ఫస్టు షోలు అన్నట్టుగా పూలరంగడు మాదిరి సినిమా ప్రాభవం చూపించింది.మల్టీ స్క్రీన్స్, చిన్న స్క్రీన్స్ హవా పెరిగిన నేపథ్యంలో బహుళజాతి కంపెనీలు ఈ వ్యాపారంలోకి వచ్చి చిన్న స్క్రీన్స్‌ను అందుబాటులోకి తెస్తున్నాయి. సినిమా వ్యాపారం గత ప్రాభవం సంతరించుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రజల సేవ కోసం కొత్త బ్రాంచ్



సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

తాడేపల్లిగూడెం: సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడం లక్ష్యంగా విశాఖ పట్టణం కోఆపరేటివ్ బ్యాంక్ పనిచేస్తుందని బ్యాంకు చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో విస్తరణలో భాగంగా తాడేపల్లిగూడెంలో 55వ శాఖను ఈ నెల 18న ప్రారంభిస్తున్నామన్నారు. 1916లో ప్రారంభమైన బ్యాంకు ద్వారా రూ.4243 కోట్ల డిపాజిట్లు, రూ.3386 కోట్ల రుణాలు, రూ.7630 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో ఉన్న సహకార బ్యాంకులలో తమ బ్యాంకు మొదటి 15 స్థానాలలో ఉందన్నారు. కోవిడ్ సమయంలో మినహా పది నుంచి 42 శాతం డివిడెండ్‌ను ప్రతి ఆర్థిక సంవత్సరంలో పంచామన్నారు. బ్యాంక్ డైరెక్టర్ చిన్నం కోటేశ్వరరావు, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి వివిబి. లక్ష్మీ, జోనల్ మేనేజర్ టి.ఆర్.ఠాగూర్ , బ్రాంచ్ మేనేజర్ కెఎంఎస్ఎస్.నారాయణ పాల్గొన్నారు.

మీ కోసంకు పది ఫిర్యాదులు



మీ కోసంలో ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

తాడేపల్లిగూడెం: మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో పది ఫిర్యాదులు అందాయి. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి నాలుగు, పబ్లిక్ హెల్త్‌లో మూడు, పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి మూడు ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా కమిషనర్ ఏసుబాబు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌పీఎఫ్ ఏఎస్సై జ్యోతికుమారి గుండెపోటుతో మృతి

అత్తిలిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



ప్రభుత్వలాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం (అంతరచిత్రం) జ్యోతికుమారి (ఫైల్)

అత్తిలి: న్యూఢిల్లీలో నోయిడాలో సీఆర్‌పీఎఫ్ 100వ బెటాలియన్ ర్యాపిడ్‌యాక్షన్‌ఫోర్సులో ఏఎస్సైగా పనిచేస్తున్న అత్తిలి గ్రామానికి చెందిన నేలపాటి జ్యోతికుమారి(56) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. ఢిల్లీ నుంచి విమానంలో ఆమె మృతదేహం గన్నవరం ఎయిర్‌పోర్టుకు సోమవారం ఉదయానికి చేరుకుంది. రాజమండ్రి నుంచి వెళ్లిన సీఆర్‌పీఎఫ్ జవాన్లు గన్నవరం నుండి ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చారు. జ్యోతికుమారి వివాహానికి ముందే సీఆర్‌పీఎఫ్ ఉద్యోగంలో చేరారు. ఈమె భర్త జాన్ మోషే తణుకు కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. మరో నాలుగేళ్ల సర్వీసు ఉండగా హఠాన్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. మిలటరీ వాహనంలో జ్యోతికుమారి మృతదేహాన్ని తణుకు నుంచి అత్తిలి వరకుభారీ ఊరేగింపుగా తీసుకువచ్చారు. సీఆర్‌పీఎఫ్ జవాన్లు సైనిక వందనం చేసి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. పెద్ద సంఖ్యలో స్థానిక యువత, అంతిమయాత్రలో పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు సహకరించండి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమకాటు ప్రజారోగ్యానికి చేటు అని, దోమల నిర్మూలనకు సహకరించాలని అలాగే ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ..లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలైన కడకట్ల పరిధిలోని 28వ వార్డులో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాలపై సోమవారం వార్డులో హెల్త్ సిబ్బందిచే అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి వాటిని నిర్వీర్యం చేయుడం, దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల మలేరియా, చికెన్‌గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధుల వ్యాప్తిని అరికడదామన్నారు. ఇంటిలోపల, బయిట నిల్వ ఉన్న నీటిలో దోమలు గ్రుడ్లు పెడతాయని, నీటి నిల్వలను పారబోసి, శుభ్రపరిచి, కడిగి అరబెట్టాలన్నారు. పొడి వాతావరణ ఉండే విధంగా చూసుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి చంద్రకళ, ఆశ వర్కర్, అనురాధ, చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత మూర్తిరాజు ఆదర్శనీయుడు



తణుకులో మూర్తిరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: విద్యాదాత మూర్తిరాజు 105వ జయంతిని సోమవారం స్థానిక ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం తాళాబత్తుల రామకృష్ణ మాట్లాడుతూ దేశాభివృద్ధికి విద్య సాధనంగా భావించిన మూర్తిరాజు ఆయన యావదాస్తిని విద్యాసంస్థల స్థాపనకు వెచ్చించిన ఆదర్శనీయుడని కొనియాడారు. డాక్టర్ దాట్ల సత్యనారాయణరాజు (డాక్టర్ జనతరాజు) మాట్లాడుతూ గోదావరి ప్రాంతంలో సుమారు 82 పాఠశాలలు, కళాశాలల స్థాపనకు మూలస్తంభంగా నిలిచి గోదావరి జిల్లాను విద్యానిలయాలుగా మార్చేందుకు కృషి చేశారని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న మూర్తిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీవీ రంగయ్య, కె.రాజేంద్ర, కె.వెంకటరెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలల మహాగర్జన విజయవంతం



మాట్లాడుతున్న మంగరాజు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు సమీపంలోని నల్లపాడులో జరిగిన మాలల మహాగర్జన సభ విజయంతమైందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మాలలంటే మనువాదులు, సైకోలు, దొంగలని, దోపిడిదారులుగా అభివర్ణించిన మందకృష్ణకు మహాగర్జన సభ విజయవంతం అవ్వడంతో చెంపపెట్టు అన్నారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కుల గణన అనంతరమే వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డిదారిలో వర్గీకరణ చేస్తే మాలల సత్తా ఏమిటో వచ్చే ఎన్నికలలో చూపిస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి ఎస్సీల రిజర్వేషన్లు తీసేయటానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు ఏక సభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ విచ్చేయుచున్నదని, మాల సంఘాలు ద్వారా ఎస్సీలు వినతిపత్రాలు తీసుకుంటుందని, వినతులు ఇవ్వడానికి తరలి రావాలని కోరారు. మాల సంఘాల జేఏసీ నాయకులు బేతాళ శరత్, పారిపెల్లి రామారావు, సునీల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పశు వధశాలలను తొలగించాలి



తేతలిలోని లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న తహసీల్దార్ అశోక్‌వర్మ, ఇతర సిబ్బంది

తణుకు టౌన్: మండలంలోని తేతలి గ్రామంలో ఏర్పాటు చేసిన పశువధ శాలను తొలగించాలని పరిసర గ్రామాల ప్రజలు, హమాలీలు అధికారులను కోరారు. సోమవారం తేతలి పంచాయతీ గ్రామ కార్యదర్శి, ఇతర సిబ్బంది తేతలిలోని లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థపై గత సోమవారం స్పందన కార్యక్రమంలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సంస్థ పరిసరాలు పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీ విచారణ కోసం తయారు చేసిన వివరాలు ప్రకారం లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్ వారి ప్రహరీ గోడ బయట ఎటువంటి అపరిశుభ్ర వాతావరణం లేదని, వ్యర్థాలు ఏమీ బయటకు రావడం లేదని సిబ్బంది గమనించినట్లు, ఈ సంస్థ నుంచి ఎటువంటి వ్యర్థాలు బయటకు రావడం లేదని, సదరు కంపెనీ నందు కాలుష్యం జరుగుతున్నదీ లేనిదీ తెలియడం లేదని పేర్కొన్నారు. దీంతో స్థానికులు, హమాలీలు, గో సేవా సమితి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో పంచాయతీ సిబ్బంది వెనుదిరిగి వెళ్లిపోయారు. ఈకార్యక్రమంలో గో సేవా సమితి నాయకులు కొండ్రెడ్డి శ్రీనివాసు, కోడూరి గిరీశ్వరరావు, కోట వెంకట బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారుల తనిఖీలు..

తణుకు రూరల్ మండలం తేతలి గ్రామంలోని లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్‌ను తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పరిశీలించారు. గత సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో గ్రామస్తులు, ఎఫ్‌సీఐ గొడౌన్స్ హమాలీలు, గో సేవా సమితి సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు సోమవారం లేహ్యం ఫుడ్ ప్రొడక్ట్స్ పరిశ్రమను పరిశీలించినట్లు తహసీల్దార్ అశోక్‌వర్మ తెలిపారు. ఈసందర్భంగా ఈ సంస్థ యాజమాన్యాని ఉన్న అనుమతులు వివరాలు తమకు ఇవ్వాలని కోరినట్లు తహసీల్దార్ తెలిపారు. తమ పరిశీలనకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ తనిఖీలలో ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్, సర్వేయరు శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి రామకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 33/11కేవీ హౌసింగ్‌బోర్డు సబ్ స్టేషన్ పరిధిలో అన్ని ప్రాంతాలలోను విద్యుత్ లైన్‌లకు అత్యవసర మరమ్మతులు నిమిత్తం ఈ నెల 17వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

అత్తిలి: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు రెండో విడత సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఈశిక్షణలో మండలస్థాయి అధికారులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎస్ఎంలు, వ్యవసాయ సహాయకులు పాల్గొంటారని చెప్పారు.

లయన్స్ సేవలు అభినందనీయం



రోగులతో మాట్లాడుతున్న తాషా హెన్‌డ్రిక్, లయన్స్ మాజీ గవర్నర్ వంకా రవీంద్రనాథ్ దంపతులు

తణుకు అర్బన్: తణుకు లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డయాలసిస్ సెంటర్ ద్వారా రోగులకు అందుతున్న సత్వర సేవలు అభినందనీయమని అమెరికాకు చెందిన లయన్స్ ఇంటర్నేషనల్ తాషా హెన్‌డ్రిక్ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలో లయన్స్ క్లబ్ నిర్వహిస్తున్న లయన్స్ డిస్ట్రిక్ట్ 316 జి వంక సత్యనారాయణ, నాగమణి రీనల్ డయాలసిస్‌ను సోమవారం ఆమె కౌన్సిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్‌లో లాభాపేక్ష లేకుండా అర్హులైనవారికి ఉచితంగా డయాలిసిస్ చేయడం చాలా మంచి పరిణామమన్నారు. గత 8 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ పేరుతో సమర్థవంతంగా అనేక వందల మందికి సేవ చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన లయన్స్ పూర్వ గవర్నర్ వంకా రవీంద్ర నాథ్, రాజా కుమారి దంపతులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ సెంటర్‌లో కేవలం డయాలిసిస్ మాత్రమే కాకుండా, నెఫ్రాలజిస్ట్ నిపుణులతో నిరంతరం రోగులను పర్యవేక్షిస్తూ ఉండడమే కాకుండా ఆహార, వ్యవహార సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడం చాలా బాగుందని తాషా అన్నారు. దాతలు ముందుకు వస్తే లయన్స్ ఇంటర్నేషనల్ మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చి సేవ కార్యక్రమాలకు పూర్తి సహకారం అందజేస్తామన్నారు. తణుకు క్లబ్, అత్తిలి క్లబ్ కూడా వారు పెట్టబోయే ప్రాజెక్ట్‌కు ఇంటర్నేషనల్ నుంచి సహకరిస్తామని స్పష్టం చేశారు. ముందుగా లయన్స్ మాజీ గవర్నర్ వంక రవీంద్రనాథ్, రాజకుమారి దంపతులు తాషా హెడ్రిక్‌కు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. జిల్లా గవర్నర్ వేణుబాబు, మల్టిపుల్ చైర్మన్ దామెర్ల శ్రీశాంతి, ఏరియా లీడర్ అంబటి సుధాకర్, జోన్ చైర్మన్ ఒంటెద్దు రాజా, పాస్ట్ గవర్నరు మాదిరెడ్డి బాపూజీరావు, దామెర్ల రంగారావు, సీనియర్ వైద్యులు డాక్టర్ తాతిన రామబ్రహ్మం, క్లబ్ అధికారులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



కళావేదికపై నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అత్తిలి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఖండవల్లి గ్రామానికి చెందిన కుమారి నరుకుల సాయిశ్రీ ప్రియ తమ శిష్య బృందంతో ప్రదర్శించిన సుబ్రహ్మణ్యేస్వామి వారి కావడి ఉత్సవ నృత్యం, రావణాష్టకం, గోపికా నృత్యం, శివ కీర్తనలతో కూడిన నృత్యాలు ప్రేక్షకులు తన్మయత్వంతో తిలకించారు. కళాకారులను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

దివ్యాంగ పిల్లలను ఆదరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలకు దాతల దాతృత్వం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. భవిత సెంటర్‌లో సోమవారం దివ్యాంగుల పిల్లలకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. దాతలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దివ్యాంగుల పిల్లలను ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల ఉషారాణి, నరేంద్ర రాజు, నాగబాబు, ప్రత్యేక ఉపాధ్యాయిని చంద్రకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.